ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
సోమవారం 10 ఫిబ్రవరి 2025

మద్యం దుకాణాల డ్రా వాయిదా

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 10న నిర్వహించాల్సిన మద్యం దుకాణాల డ్రా ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్‌శాఖ అధికారి సీహెచ్ తిరుపతి నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'జిల్లాలో గీత కార్మికులకు కేటాయించిన 16 కొత్త మద్యం దుకాణాలకు 166 దరఖాస్తులు, సొండి కులానికి కేటాయించిన 2 దుకాణాలకు 37 దరఖాస్తులు వచ్చాయి. డ్రా ప్రక్రియ తాత్కాలికంగా వాయిదా పడింది. త్వరలో డ్రా తేదీని ప్రభుత్వం ఖరారు చేస్తుంద'ని తిరుపతి నాయుడు తెలిపారు.

మెండుగా.. పర్యాటకం

పర్యాటకులకు శుభవార్త. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు కూతవేటు దూరంలో జాతీయ రహదారి చెంతనే 'మెండు నగర వనం' అందుబాటులోకి రానుంది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ సేదదీరేలా అత్యాధునిక నిర్మాణాలతో దీనిని ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకోసం రూ.2కోట్ల నిధులు విడుదల చేసింది. ఇప్పటివరకూ ఇటువంటి నిర్మాణాలు పర్యాటక శాఖ ద్వారా జరిగేవి. కానీ తొలిసారిగా అటవీ శాఖ ఈ నగర వనం నిర్మాణానికి పూనుకోవడం గమనార్హం.


కాశీబుగ్గ కోసంగిపురం వద్ద మెండు నగరవనం ముఖద్వారం

- కాశీబుగ్గ సమీపాన నగర వనం ఏర్పాటు
- 125 ఎకరాల అటవీ భూమిలో నిర్మాణాలు
- శరవేగంగా సాగుతున్న పనులు

కాశీబుగ్గ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి):

పర్యాటకాభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పట్టణాలు, నగరాలకు సమీపాన ఉన్న అటవీ ప్రాంతాల్లో నగర వనాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లాకు సంబంధించి పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధి కోసంగిపురం జంక్షన్ సమీపంలో 125 ఎకరాల్లో 'మెండు నగర వనం' ఏర్పాటుకు చర్యలు చేపడుతోంది. జాతీయ రహదారి చెంతనే ఈ ప్రాంతంలో 650 ఎకరాల విస్తీర్ణంలో మెండు ఫారెస్టు ఏరియా విస్తరించి ఉంది. పలాస, మందస, మెళియాపుట్టి మండలాల వరకూ అంతటా అటవీ ప్రాంతమే. అరుదైన జంతువులు, పక్షులు, ఇతర మూగ జీవాలు ఇక్కడ నివసిస్తుంటాయి. జీడి చెట్లు అధికంగా ఉన్నాయి. ఎంతో ఆహ్లాదంగా ఉన్న ఈ ప్రాంతంలో అటవీశాఖ ఆధ్వర్యంలో నగర వనం నిర్మించేందుకు ప్రభుత్వం రూ.2కోట్ల నిధులు మంజూరు చేసింది. అడవుల సంరక్షణ, వర్షపునీటి పరిరక్షణ ధ్యేయంగా నగరవనాన్ని నిర్మిస్తోంది. ఇక్కడ అటవీ శాఖ కార్యకలాపాల ద్వారా మెండు అటవీ ప్రాంతాన్ని రక్షించవచ్చన్నది ప్రభుత్వ ఆలోచన. మరోవైపు అటవీ ఉత్పత్తుల క్రయ విక్రయాలు ఇక్కడ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. చిన్నారులు ఆడుకునేందుకు (మిగతా 8వ పేజీలో..)


పర్యాటకులు విశ్రాంతి తీసుకునేందుకు పర్ణశాల

సిటీ ఫారెస్ట్‌గా తీర్చిదిద్దుతాం

- వన్య ప్రాణులతో పాటు వృక్ష సంపద రక్షణకు కృషి
- జిల్లా అటవీశాఖ అధికారి శంబంగి వెంకటేష్



శ్రీకాకుళం అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఏడాది రూ.2.5 కోట్ల నిధులతో వృక్ష సంపద అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని జిల్లా అటవీశాఖ అధికారి శంబంగి వెంకటేష్ తెలిపారు. వన్యప్రాణులతోపాటు వృక్ష సంపద రక్షణకు కృషి చేస్తున్నామన్నారు. 'జిల్లాలో ప్రస్తుతం 18 శాతం వృక్ష సంపద ఉంది. దీనిని మరింత పెంచేందుకు కాశీబుగ్గలో మెండు నగర వనాన్ని రూ.1.4 కోట్లతో సిటీ ఫారెస్ట్‌గా తీర్చిదిద్దనున్నాం. నర్సరీల అభివృద్ధికి చర్యలు చేపట్టాం. ఉపాధిహామీ పథకం కింద జిల్లాలో ఈ ఏడాది జూన్ నాటికి 21 లక్షల మొక్కలు నాటనున్నాం. సముద్ర తీర ప్రాంతంలో వృక్ష సంపదను పెంచేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. వన్యప్రాణుల సంరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తున్నాం. తీరప్రాంత ప్రజలతో ప్రతీ నెల అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నాం. తీర ప్రాంతాల్లో మరబోటు వలలకు చిక్కి తాబేళ్లు మరణిస్తున్నాయి. వాటి సంరక్షణ కోసం 40 మంది మత్స్యకారులకు శిక్షణ కల్పించాం. తాబేళ్లు గుడ్లు పెట్టే కాలంలో వాటి రక్షణ కోసం ఐదు నెలల పాటు వారికి వేతనాలు కూడా చెల్లిస్తున్నాం. దీని కోసం రూ.25లక్షల నిధులు కేటాయిస్తున్నాం. ఇటీవల జిల్లాలో పులి సంచారం వాస్తవమే. ఒక చిరుత ఒడిశా- విజయనగరం- శ్రీకాకుళం అటవీ ప్రాంతంలో చాలాకాలంగా సంచరిస్తోంది. ప్రస్తుతం ఒడిశా వైపు వెళ్లిపోయింది. పులి సంచారంపై నిఘా పెట్టాం. అటవీ ప్రాంతంలో జీడి తోటలకు సమీపంలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలి' అని డీఎఫ్‌వో వెంకటేష్ సూచించారు.

చురుగ్గా నిర్మాణాలు

కాశీబుగ్గ నగర వనంలో చురుగ్గా పనులు సాగుతున్నాయి. ప్రభుత్వం రూ.2 కోట్లు నిధులు మంజూరు చేసింది. తొలివిడతగా రూ.1.60 కోట్లు విడుదల చేసింది. మిగతా నిధులతో సైతం అన్ని హంగులు కల్పిస్తాం. కొద్ది నెలల్లో ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకుంటున్నాం.

- ఎ.మురళీకృష్ణ నాయుడు, అటవీశాఖ అధికారి, పలాస

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్


- 114 కేంద్రాల్లో నిర్వహణకు ఏర్పాట్లు

నరసన్నపేట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 20వరకు జనరల్ విద్యార్థులకు ఉదయం, మధ్యాహ్నం ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. 114 కేంద్రాల్లో నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 71 ప్రైవేటు, 13 మోడల్ కళాశాలలు, ప్లస్ వన్ కళాశాలలు -6, జ్యోతీరావు పూలే -1, ట్రైబుల్ వెల్ఫేర్-1, 25 కేజీబీవీలు, 9 సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలు మొత్తంగా 164 ఉన్నాయి. ప్రథమ సంవత్సరం 20,678 మంది, ద్వితీయ సంవత్సరం 18,792 మంది చదువుతున్నారు. ప్రాక్టికల్స్‌కు 15,976మంది హాజరుకానున్నారు. వీరిలో భౌతిక, రసాయన శాస్త్రాలకు సంబంధించి 15,976 మంది, బోటనీ 5,133మంది, జువాలజీ 5,133 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా నడుమ ప్రాక్టికల్స్ నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

నారాయణా.. నీటి కష్టాలు తీరేనా?


ముద్దాడ సమీపంలో పాడైన షట్టర్

- పూర్తికాని ఆధునీకరణ పనులు
- గత ఐదేళ్లు పట్టించుకోని వైసీపీ
- రైతులకు తప్పని ఇబ్బందులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు


నవభారత్ జంక్షన్ వద్ద నారాయణపురం కుడికాలువ ఇలా..

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి)

నారాయణపురం ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు ఏళ్ల తరబడి కొనసాగుతూనే ఉన్నాయి. జిల్లాలోని ఏడు మండలాల పరిధిలో ఆయకట్టు రైతులకు ఏటా సాగునీటి కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో కూడా ఎచ్చెర్ల నియోజకవర్గంలో శివారు ప్రాంత రైతులకు సాగునీరు అందక ఇబ్బందులు ఎదురయ్యాయి. 2019లో టీడీపీ ప్రభుత్వ హయాంలో నారాయణపురం కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణకు రూ.112 కోట్లు జైకా నిధుల విడుదలకు ఒప్పందం కుదిరింది. టెండర్లు కూడా ఖరారయ్యాయి. ఇందులో కుడి కాలువకు సుమారు రూ.38.7కోట్లు కేటాయించారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు సమీపించి.. వైసీపీ అధికారంలోకి రావడంతో పనుల్లో జాప్యమైంది. తొలుత కొవిడ్, ఆ తర్వాత నిధుల కొరత కారణంగా ఆధునికీకరణ పనులు అంతంతమాత్రమే జరిగాయి. గత ఐదేళ్లూ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పనులు పూర్తికాలేదు. ఇప్పటికే రెండు సార్లు పనులు పూర్తికి చేసుకున్న అగ్రిమెంట్లకు కాలం చెల్లింది.

● నారాయణపురం ఆనకట్ట కింద కుడి, ఎడమ కాలువలు ఉన్నాయి. కుడి కాలువ కింద సంతకవిటి, పొందూరు, ఎచ్చెర్ల మండలాల పరిధిలో సుమారు 50.6 ఎకరాల పొడవునా కాలువ ఉంది. ఈ కాలువ పరిధిలో సుమారు 40శాతం వరకు మాత్రమే పనులు జరిగాయి. పనులు ప్రారంభించేందుకు అధికారులు కార్యచరణ సిద్ధం చేశారు. ఆధునికీకరణ పనుల్లో భాగంగా తోలాపి నుంచి శివారు ఆయకట్టు వరకు సుమారు 23 కిలోమీటర్లు కాలువ లైనింగ్ చేయాల్సి ఉంది. ఫరీద్‌పేట నుంచి భగీరథపురం కృష్ణసాగరం వరకు ఎర్త్‌వర్క్, గట్టు బలపర్చడం, జంగిల్ క్లియరెన్స్ చేపట్టాల్సి ఉంది. అలాగే ఆమదాలవలస, శ్రీకాకుళం రూరల్, బూర్జ, గార మండలాల పరిధిలో ఎడమ కాలువ వ్యాపించి ఉంది. ఈ కాలువ పనులు కూడా సక్రమంగా సాగని పరిస్థితి నెలకొంది.

శిథిలావస్థలో షట్టర్లు, వంతెనలు..

నారాయణపురం ఆనకట్ట ఏర్పాటు చేసిన సమయంలో కుడి కాలువ పొడవునా బిగించిన సుమారు 60 షట్టర్లు పాడయ్యాయి. షట్టర్లు లేకపోవడంతో సాగునీరు వృథాగా పోతోంది. అలాగే వాసుదేవపట్నం, చిన్నయ్యపేట, బూరాడపేట, మంతిన, గోకర్ణపల్లి, దుప్పలవలస సమీపంలోని బ్రిడ్జిలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎచ్చెర్ల మండలం దుప్పలవలస బ్రిడ్జి పరిస్థితి మరింత దారుణంగా (మిగతా 8వ పేజీలో..)


హిరమండలంలో కొళాయిల నీరు ఇలా..

ఈ నీటినే తాగమంటారా? 8లో

- కొళాయిల నుంచి బురదనీరు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు

చనిపోయిందనుకుని లొంగిపోయాడు..

- భార్యపై దాడి
- పోలీసుల వద్ద లొంగిపోయిన భర్త
- స్పృహలోకి వచ్చిన తర్వాత ఫిర్యాదు చేసిన భార్య
- తాడివలస సమీప తోటలో ఘటన

8లో

నరసన్న చెరువుపై అక్రమార్కుల కన్ను

- వేస్ట్ మెటీరియల్ వేసి.. ఆపై ఆక్రమణ
- ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

8లో

ఉత్సాహంగా బాడీ బిల్డింగ్ పోటీలు 7లో


జాతరలో భక్తుల రద్దీ..

దీవించమ్మా.. మహాలక్ష్మమ్మ

- కమ్మసిగడాం యాత్రకు పోటెత్తిన భక్తజనం

7లో

వత్సవలస రాజమ్మ జాతర ప్రారంభం


అరసవల్లిలో పుష్కరిణి వద్ద ఎండలో భక్తుల పాట్లు

ఆదిత్యుడి సన్నిధిలో భక్తుల అవస్థలు

- అరకొర ఏర్పాట్లు
- అధికారుల తీరుపై అసంతృప్తి


ఎండలో నిల్చొని.. స్వామి దర్శనానికి వెళ్తున్న భక్తులు

అరసవల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మాఘ ఆదివారాన్ని పురస్కరించుకుని అరసవల్లిలో ఆదిత్యుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఇంద్రపుష్కరిణి సమీపాన రావిచెట్టు వద్ద దీపాలు వెలిగించి, క్షీరాన్నం వండి స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. రథసప్తమి ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో ఉన్న షెడ్లను అధికారులు తొలగించారు. కానీ ఆదివారం నాడు రద్దీకి సరిపడా టెంట్లు ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు ఎండలో అవస్థలు పడ్డారు. తాగునీటి వసతి కూడా లేక ఇబ్బందులు పడ్డారు. ప్రసాదాల కౌంటర్ వద్ద కూడా ఎండలోనే బారులుదీరారు. అధికారుల నిర్లక్ష్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ప్రత్యేక దర్శనాలకు అనుమతించే ఆలయ ముఖద్వారం వద్ద భక్తులను పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. పరిస్థితిని చక్కదిద్దేందుకు ఆలయ అధికారులెవరూ రాలేదు. దినసరి వేతన సిబ్బంది ఏం చేయలేక నిస్సహాయంగా కనిపించారు. ప్రత్యేక దినాల్లో కూడా ఆలయ అధికారులు అందుబాటులో లేకపోవడం దారుణమని, ఇంతకు మునుపెన్నడూ ఇటువంటి పరిస్థితులను చూడలేదని పలువురు భక్తులు వాపోయారు. అధికారులు స్పందించి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఆకట్టుకున్న దీపోత్సవం

జి.సిగడాం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జి.సిగడాం మండలం నిద్దాంలో నిద్దాలమ్మ యాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన లక్ష దీపోత్సవం భక్తులను ఆకట్టుకుంది. గ్రామ పురవీధుల్లోనూ దీపాలను వెలిగించడంతో నిద్దాం.. కాంతివంతమైంది. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సతీమణి ప్రభానాయుడు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దీపోత్సవాన్ని ప్రారంభించారు. వందలాది మంది భక్తులు పాల్గొని దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.



దీవించమ్మా.. మహాలక్ష్మమ్మ

- చివరి రోజు జాతరకు పోటెత్తిన భక్తజనం
- అమ్మవారిని దర్శించుకున్న ఎంపీలు పురందేశ్వరి, కలిశెట్టి

రణస్థలం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కమ్మసిగడాం మహాలక్ష్మి తల్లి జాతర చివరి రోజు ఆదివారం అంబరాన్ని తాకింది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహాలక్ష్మి తల్లిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దర్శించుకున్నారు. పురందేశ్వరికి ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు వీవీఎస్‌వీ ప్రసాద్, బంటుపల్లి సర్పంచ్ నడుకుదిటి రజిని ఘన స్వాగతం పలికారు. ఆమెకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. కూటమి ప్రభుత్వానికి అమ్మవారి ఆశీస్సులు ఉన్నాయని, మహాలక్ష్మిని దర్శించుకోవడం ఎంతో ఆనందగా ఉందని పురందేశ్వరి అన్నారు.







అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీలు పురందేశ్వరి, కలిశెట్టి | జాతరకు పోటెత్తిన జనం

ధనరాజ తులసమ్మ సంబరం..

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలో ధనరాజ తులసమ్మతల్లి సంబరం ఆదివారం ఘనంగా జరిగింది. పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళలు ఘటాలతో వచ్చి మొక్కులు చెల్లించారు. పసుపునీరు, పానకాలతో అమ్మవారికి అభిషేకాలు జరిపారు.



పూజలందుకుంటున్న అమ్మవారు

సంతవురిటిలో..

జి.సిగడాం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): సంతవురిటిలో ఆదివారం రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ముందుగా ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, పరిషత్ రక్షాబంధన, అంకురార్పణ, మండలారాధన, పతాకప్రతిష్ఠ, మృత్సంగ్రహణం వంటి పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



వేణుగోపాల స్వామి తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం



విద్యుత్ వెలుగుల్లో అమ్మవారి ఆలయం

కాళపర్తిలో..

బూర్జ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కాళపర్తి గ్రామంలో మట్టచ్చమ్మ పేరంటాలు ఆదివారం సందడిగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ వెలుగులతో అలంకరించారు. అమ్మవారికి పసుపు కుంకాలు సమర్పించారు.

వత్సవలస రాజమ్మ జాతర ప్రారంభం

- తొలివారం పోటెత్తిన భక్తులు

గార, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వత్సవలస రాజమ్మ జాతర ఆదివారం ప్రారంభమైంది. తొలివారం అధిక సంఖ్యలో భక్తులు సముద్ర స్నానాలు ఆచరించి రాజమ్మను దర్శించుకున్నారు. అలాగే శ్రీకూర్మంలో కూర్మనాథుని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సీఐలు పైడపునాయుడు, బి.ప్రసాదరావు(మెరైన్), ఎస్ఐ ఆర్.జనార్దన్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. శ్రీకూర్మం క్షేత్రంలో కూడా భక్తుల రద్దీ నెలకొంది.



శ్రీకూర్మంలో కూర్మనాథుని దర్శించుకునేందుకు క్యూలో భక్తులు



సముద్ర స్నానాలు చేస్తున్న భక్తులు

రేపు ఆధ్యాత్మిక కార్యక్రమం

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆధ్యాత్మిక కార్యక్రమం సురంగి రాజా మైదానంలో నిర్వహించనున్నట్టు ఆదివారం నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి యూరప్ దేశాల నుంచి 30మంది భక్తులు అతిథిలుగా రానున్నట్టు తెలిపారు. నగర సంకీర్తన, భజన కార్యక్రమాలు, ప్రవచనాలు జరుగుతాయన్నారు.

12న స్వామివారి కల్యాణం

గార, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శ్వేతగిరిపై (శాలిహుండం కొండపై) వెలసిన కాళీయ మర్ధన వేణుగోపాల స్వామి వారి వార్షిక కల్యాణం ఈ నెల 12న నిర్వహించనున్నామని ట్రస్ట్ బోర్డు చైర్మన్ సుగ్గు మధురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు ఈ కల్యాణంలో పాల్గొని స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

ఐదు కేసులు నమోదు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గడిచిన తొమ్మిది రోజుల్లో ఐదు కేసులు నమోదు చేసినట్టు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు మూడు ఒడిశా మద్యం కేసులు, రెండు డ్యూటీ పెయిర్ లిక్కర్ కేసులు నమోదు చేశామన్నారు. అక్రమ మద్యంతోపాటు గంజాయి, సారా రవాణాపై టోల్‌ఫ్రీ నెంబరు 14405కి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

విలువలు అలవర్చుకోవాలి

సరుబుజ్జిలి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జీవితంలో నైపుణ్య అభివృద్ధితో పాటు మానవత్వ విలువ కూడా పెంపొందించుకోవాలని శ్రీకాకుళం సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు మాస్టర్ అన్నారు. ఆమదాలవలస జోనల్ కన్వీనర్ ఎం.జనార్దనరావు అధ్యక్షతన ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందినవారికి ధ్రువపత్రాలు అందించారు. జిల్లా సేవాదళ్ కో-ఆర్డినేటర్ పి.నాగేశ్వరరావు, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి బోయిన నరసింహమూర్తి, జిల్లా యూత్ కో-ఆర్డినేటర్ శివకుమార్, జిల్లా బాల వికాస్ రిసోర్స్‌పనర్సన్ లాడె చంద్రశేఖర్ మాస్టార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు

ఆమదాలవలస, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వార్డుల్లో పారిశుధ్య నిర్వహణే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ నాయకులు బాగాన అమ్మినాయుడు, పాతిన రమణమూర్తి అన్నారు. ఆదివారం పురపాలక సంఘంలోని 15వ వార్డు పరిధిలోని పాతినవారివీధిలోని కాలువల్లో దోమలు నివారణ ముందు పురపాలక సంఘ సిబ్బందితో స్ప్రే చేయించారు. అదే వీధిలో ప్రధాన రహదారిపై ఉన్న చేతిపంపు గత కొన్నాళ్లుగా పాడై మూలకు చేరడంతో మరమ్మతు చేయించారు.

గణితంతో మేధస్సుకు పదును

పొందూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గణితం విద్యార్థుల మేధస్సుకు పదునుపెడుతుందని ఎంఈవో-2 పి.రాజారావు అన్నారు. సిక్కోలు గణిత ఉపాధ్యాయుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం వావిలపల్లిపేట మోడల్ స్కూల్‌లో మండలంలో పాఠశాలల్లో 6,7 తరగతి విద్యార్థులకు గణిత క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు పి.హరిప్రశన్న, జి.వేణుగోపాలరావు, ఎస్.సత్తిరాజు, పాల్గొన్నారు.

బాల సాహిత్యాన్ని ప్రోత్సహించాలి

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రచయితలు, కవులు బాల సాహిత్యాన్ని ప్రోత్సహించాలని యువ రచయితల వేదిక అధ్యక్షురాలు తంగి ఎర్రమ్మ అన్నారు. కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం కవులు రచయితలతో చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాలసాహిత్యాన్ని యువ సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ బాలలకు, యువకులకు తెలిసే విధంగా రాయాలన్నారు. కార్యక్రమంలో నాగభూషణ్, భాస్కరరావు, జి.గోపాలకృష్ణ, ధనుంజయరావు, మాలతి, శంకర్‌రావు పాల్గొన్నారు.

వీవోఏల నూతన కార్యవర్గం

అరసవల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వెలుగు వీవోఏల సంఘ సమావేశం ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ జిల్లా గౌరవాధ్యక్షురాలిగా అల్లు మహాలక్ష్మి, అధ్యక్షురాలిగా వర్రి ధనలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా గొండు అసిరినాయుడు, ఉపాధ్యక్షుడిగా దండుపాటి జోగారావు, ఉప కార్యదర్శిగా నౌపడ రాజేశ్వరి, కోశాధికారిగా బీశెట్టి హేమలత, మరో 30 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నికయ్యారు.

అణగారిన వర్గాలకు తగిన గుర్తింపు

ఆమదాలవలస, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతో అణగారిన వర్గాలకు తగిన గుర్తింపు లభిస్తుందని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు టి.ధనుంజయరావు అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక మున్సిపల్ పాఠశాలలో విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయన్ని ఘనంగా సత్కరించారు. విశ్వ బ్రాహ్మణ సామాజిక వర్గానికి టీడీపీ పాలనలోనే గుర్తింపు లభిస్తుందన్నారు. విశ్వ బ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు లోలుగు విశ్వేశ్వరరావు, కార్యదర్శి డి.శ్రీనివాసరావు, క్రియాశీలక సభ్యుడు ఎం.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో నెల్లిమర్ల ఎమ్మెల్యే

అరసవల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే లోకం మాధవి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా.. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ వారికి స్వామి వారి జ్ఞాపికను అందజేశారు. కాగా స్వామి వారికి ఆదివారం ఒక్క రోజు రూ.10,63,229 ఆదాయం లభించిందని ఈవో భద్రాజీ తెలిపారు. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.6,78,600, విరాళాల ద్వారా రూ.1,16,454, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.2,68,175 ఆదాయం లభించినట్టు పేర్కొన్నారు.



ఎమ్మెల్యేకు స్వామివారి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తాచాటి, జిల్లా కీర్తిని ఇనుమడింపజేయాలని జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్ అన్నారు. స్థానిక శాంతినగర్ కాలనీలో గల ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి మాస్టర్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఎంపికైన వారు కృష్ణా జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని కోరారు. ఎంపికల్లో గెలుపొందినవారికి జ్ఞాపికలు అందజేశారు. 35 ఏళ్ల పైబడిన వారిలో కిల్లి హరీష్, శిమ్మ శైలజ, వై.లక్ష్మణరావు, ఎల్‌వీ ప్రసాద్, 40 ఏళ్ల పైబడిన వారిలో ఎ.మోహనరావు, దుంపల రవికుమార్, ఎ.శ్రీకాంత్, ఎస్.పూర్ణిమారావు, 55 ఏళ్ల పైబడిన వారిలో ఎం.అశోక్‌కుమార్, సీహెచ్ రఘు, 60 ఏళ్ల పైబడిన వారిలో ఆర్.కృష్ణారావులు గెలుపొందారు. సంఘ ప్రతినిధులు అశోక్‌కుఆమర్, జి.ప్రసాద్, రమేష్, ఎం.శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో టాలెంట్ టెస్ట్

గుజరాతీపేట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో ఆదివారం జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఏపీ బయోలజీ టీచర్స్ ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని 27 మండలాల నుంచి మొదటిస్థానంలో నిలిచినవారితోపాటు ఆరుగురుతో కూడి ఒరియా జట్టు పాల్గొంది. ఈ పోటీల్లో ఏపీ మోడల్ స్కూల్, తామాడ (ప్రథమ), రొంపివలస ఉన్నత పాఠశాల (ద్వితీయ), పెద్ద పద్మాపురం పాఠశాల (తృతీయ) స్థానాల్లో నిలిచాయి. ఒడియా విభాగంలో టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ప్రథమ), ఈదుపురం ఉన్నత పాఠశాల (ద్వితీయ) స్థానాల్లో నిలిచాయి. కార్యక్రమంలో బయోలజీ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు పుట్టా ఉదయ్‌కుమార్, కార్యదర్శి పి.గోవిందరావు, ప్రమోద్‌కుమార్ పాఢీ, మురళీ దొలై, జి.గిరిధర్, ఎం.కవిత, కె.గగన కుమారి, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.23కోట్లతో రహదారి నిర్మాణం

కంచిలి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): అంపురం జంక్షన్ నుంచి ఘటిము కుందపురం గ్రామం వరకు రహదారి నిర్మాణానికి రూ.23 కోట్లు మంజూరైనట్టు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఈ రహదారిని పరిశీలించారు. అనంతరం బెల్లుపడలో గ్రామస్థులు విప్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బుడ్డెపు కామేష్, మాదిన రామారావు, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.



విప్‌ను సన్మానిస్తున్న బెల్లుపడ గ్రామస్థులు

సందడిగా బోటుషికారు

గార, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కె.మత్స్యలేశం బీచ్‌లోని అడ్వెంచర్ స్పోర్ట్స్ పార్కులో ఆదివారం పలువురు బోటు షికారుతో చేశారు. పర్యాటకంగా ఏర్పాటు చేసిన ఈ పార్కులో పలువురు కుటుంబ సభ్యులతో కలిసి సందడిగా గడిపారు.



బోటుషికారు చేస్తున్న దృశ్యం

ఆలోచింపజేసిన నాటికలు

కవిటి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): సమాజంలో జరిగే సంఘటన ఆధారంగా రూపకల్పన చేసిన నాటికలు చూపరులను ఆలోచింపజేశాయి. బొరివంకలో నాటికపోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. రెండోరోజు ఆదివారం రాత్రి ఒంగోలులోని కొప్పోలుకు చెందిన పండు క్రియేషన్స్ వారు పక్కింటి మొగుడు నాటిక ప్రదర్శించారు. డబ్బుకు ఆశపడి పక్కింటి వ్యక్తితో పరిచయంపెట్టుకొని కాపురాన్ని నాశనం చేసుకొన్న పరిస్థితి ఈ నాటిక ద్వారా వివరించారు. గుంటూరుకు చెందినవారు చిగురుమేఘం నాటికను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో వైద్యవృత్తి ఇతిహాసంగా చేసుకొని కన్నతల్లిని సరైన వైద్యాన్ని అందించలేకపోయి, గ్రామీణప్రాంతానికి వెళ్లి తల్లిదండ్రుల ఆశలను నిజం చేసిన విషయాని వివరించారు. న్యాయనిర్ణేతలుగా సత్యనారాయణ, బ్రహ్మానందం, మంగరావు వ్యవహరిస్తున్నారు.

కళలు చరిత్రకు సాక్ష్యాలు: కేంద్రమంత్రి రామ్మోహన్

ఆమదాలవలస, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కళలు భవిష్యత్తు తరాలకు అందించే చరిత్రకు సాక్ష్యాలుగా నిలుస్తాయని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. పట్టణంలోని పాలపోలమ్మ గుడి ఆవరణలో ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీల్లో భాగంగా మూడో రోజు ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అంతరించిపోతున్న నాటక రంగానికి ఆమదాలవలస రంగస్థల కళాకారుల సంఘం జీవం పోసిందని, ఈ సందర్భంగా ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు తమ్మినేని విద్యాసాగర్, పేడాడ ప్రతాప్‌కుమార్‌తోపాటు ప్రతినిధులను అభినందించారు. ఆమదావలసలో ఆడిటోరియం నిర్మించి ప్రజలకు అందిస్తానన్నారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ.. కళలను ప్రోత్సహించడం అంటే మన సంప్రదాయాన్ని పరిరక్షించుకోవడమేనన్నారు. కేంద్ర మాజీమంత్రి కిల్లి కృపారాణి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన కళాకారులు మూడు నాటికలు ప్రదర్శించారు.



మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

పార్టీ బలోపేతానికి కృషిచేయండి: ఎంపీ పురందేశ్వరి

గుజరాతీపేట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన పార్టీ నాయకుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్‌జీ మండల కమిటీలు, సంస్థాగత బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, నాయకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, సాగి కాశీ విశ్వనాథరాజు, పైడి గోపాలం, బిర్లంగి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాడీబిల్డింగ్ పోటీలు



బాడీబిల్డర్ల ప్రదర్శన

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక పీఎస్ఎన్ఎం స్కూల్ ఆవరణలో ఆదివారం రాత్రి నిర్వహించిన మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన బాడీబిల్డర్లు వివిధ భంగిమలతో ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం విశాఖ పోలీసు ఉద్యోగిగా ఉంటూ ఎన్నో సినిమాల్లో నటుడిగా ఉన్న షేక్ శ్రీను ప్రదర్శన పలువుర్ని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా బాక్సింగ్ శిక్షకులు, రాష్ట్ర, జాతీయస్థాయిలో ఎందరో క్రీడాకారులుగా తీర్చిదిద్దిన మాణిక్యం ఉమామహేశ్వరరావును ఘనంగా సన్మానించారు. జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.ప్రసాద్, కార్యదర్శి వి.విజయ్‌కుమార్, నేషనల్ రిఫరీ బి.సూరిబాబు, కె.గౌరీశంకర్‌ల పర్యవేక్షణలో పోటీలు నిర్వహించగా, న్యాయనిర్ణేతలుగా గురునాథరావు, టి.రమా, డి.సోమినాయుడు, ఢిల్లీ, రత్నాకర్, పి.రెడ్డి, మదిడయ్యరెడ్డి, విష్ణుమూర్తి, నాగబాబు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం బాపూజీ కళామందిర్‌లో ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభమయ్యాయి. నృత్య దర్శకుడు రఘుపాత్రుని శ్రీకాంత్ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన స్వేచ్ఛ నాటిక ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం జరిగిన సమావేశంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్ రావు, గజల్ వాసుదేవాచారి, తెప్పల కృష్ణమూర్తి, సుగుణకరరావు, నిక్కు హరిసత్యనారాయణ, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.



కళాకారుల నృత్య ప్రదర్శన



సత్యసాయి పల్లకీసేవ

గార, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): యాళ్లపేటలో ఆదివారం భగవాన్ సత్యసాయిబాబా పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. మహిళలు పూర్ణకలశాలతో పల్లకీ సేవలో పాల్గొని బాబా నామాన్ని జపించారు. జోనల్‌యూత్ కోఆర్డినేటర్ చరణ్, హర్ష, తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

రణస్థలం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో గల విశ్వనాథ కుమార్ స్పోర్ట్స్ క్లబ్‌లో గత మూడు రోజులుగా జరిగిన కరాటే పోటీల్లో పైడిభీమవరం గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. లోహిత, కె.హాసిని, ఎస్.ప్రదీప్, ఐ.భరత్, బి.వెంకట మేహుల్, హిరణ్య, రవి, మౌళి, బి.హాసిని, యోగితాశ్రీ, నిత్యశ్రీ, ఎస్.భవిష్య, ఐ.ముదుప్రియ, కుమార్, రుషిత, ఇందిరా వాసవి, వర్షిణి పతకాలు సాధించారు.

కుంభమేళాకు 16న ఆర్టీసీ బస్సు

అరసవల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న కుంభమేళా (ప్రయాగరాజ్)కు శ్రీకాకుళం 1వ డిపో నుంచి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు. ఈ నెల 8, 12వ తేదీల్లో ఏర్పాటు చేసిన సర్వీసులకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. దీంతో ఈ నెల 16న సర్వీసును ఏర్పాటు చేశారు. ఈ బస్సు 16వ తేదీ రాత్రి 8.00గంటలకు శ్రీకాకుళం బస్‌స్టేషన్ నుంచి బయలుదేరి, పూరిలో జగన్నాథస్వామి ఆలయం, భువనేశ్వర్‌లో లింగరాజ్ ఆలయం దర్శించుకుని మూడో రోజు సాయంత్రానికి ప్రయాగరాజ్‌కు చేరుకుంటుంది. నాలుగో రోజు ప్రయాగరాజ్‌లో త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. అక్కడి నుంచి ఐదో రోజు ఉదయానికి వారణాశి చేరుకుంటుంది. కాశీ విశ్వనాథుని దర్శనానంతరం బుద్ధగయ క్షేత్ర దర్శనం చేసుకుని, ఏడో రోజు రాత్రికి శ్రీకాకుళం చేరుకుంటుంది. ప్రయాణానికి సంబంధించి ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కల్పించారు. యాత్రికులకు మధ్యాహ్నం భోజనం, ఉదయం, రాత్రి అల్పాహారం అదించనున్నారు. మరిన్ని వివరాలకు 9959225608, 9959235609, 9959225610, 9959225611, 7382917289, 7382921647 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నిర్బంధంగా పని చేయించడం నేరం

అరసవల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కార్మికులను నిర్బంధించి పని చేయించడం చట్టరీత్యా నేరమని శ్రీకాకుళం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వై.శైలేష్‌కుమార్ అన్నారు. వెట్టిచాకిరీ నిర్మూలన దినం సందర్భంగా ఆదివారం స్థానిక ఎన్జీవో హోమ్ వద్ద ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాను వెట్టిచాకిరీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేద్దామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్‌పీ శ్రీనివాసరావు, ఏఎల్‌వో, ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు సీహెచ్ గోవింద్, నేచర్ ఎన్జీవో ప్రతినిధులు శేఖర్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య

జి.సిగడాం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను ఆధార్ తరహాలో అందిస్తుందని ఏవో ఎర్రా శారద ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వంత భూమి గల రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్‌తో రైతు సేవా కేంద్రాల వద్ద నమోదు చేసుకోవాలని కోరారు.

క్రైం కార్నర్

చనిపోయిందనుకుని లొంగిపోయాడు..

● భార్యపై దాడి ● పోలీసుల వద్ద లొంగిపోయిన భర్త ● స్పృహలోకి వచ్చిన తర్వాత ఫిర్యాదు చేసిన పావని ● తాడివలస సమీపంలోని తోటలో ఘటన



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పొందూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వారిద్దరూ భార్యభర్తలు.. తరచూ గొడవపడుతున్నారు.. ఈ క్రమంలో క్షణికావేశంతో విచక్షణ కోల్పోయిన భర్త భార్యపై దాడి చేశాడు. ఈ నేపథ్యంలో ఆమె చనిపోయిందనుకుని అక్కడే వదిలేసి అతడు పోలీసుల వద్ద లొంగిపోయాడు. తీరా స్పృహలోకి వచ్చిన ఆమె తల్లిదండ్రులతో కలిసి వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటన మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలను పోలీసులు ఆదివారం తెలిపారు. లైదాం గ్రామానికి చెందిన గొర్లె సాయిప్రసాద్‌కు సంతకవిటి మండలం బలరాంపేటకి చెందిన పావనితో వివాహమైంది. సాయి ఓ ఆన్‌లైన్ కంపెనీలో ఫుడ్ డెలివరీ బాయ్‌గా పని చేస్తూ.. శ్రీకాకుళం పట్టణంలో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. వీరికి ఏడు నెలల కుమారుడు సాత్విక్ ఉన్నాడు. కొద్ది నెలలుగా వీరిద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తి తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం భార్యా భర్తలిద్దరూ ద్విచక్రవాహనంపై శ్రీముఖలింగం దైవ దర్శనానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా కొత్తపేట కూడలిలో గొడవపడ్డారు. దీంతో పావనిని కన్నవారి ఇంట్లో దింపేందుకు బలరాంపేట ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో తాడివలస పీహెచ్‌సీ సమీపంలో ఉన్న తోట వద్దకు వచ్చేసరికి మరోసారి మాటామాటా పెరిగింది. దీంతో సాయి క్షణికావేశానికి లోనై పావనిపై దాడిచేయడమే కాకుండా చున్నీతో ఆమె మెడకు బిగించడంతో ఆమె స్పృహ కోల్పోయింది. దీంతో పావని చనిపోయిందని భావించిన సాయి.. శ్రీకాకుళం వచ్చేసి ఎస్పీ కార్యాలయంలో పోలీసులకు లొంగిపోయాడు. ఇదిలా ఉంటే స్పృహ కోల్పోయిన పావనికి కాసేపటికి తెలివి రావడంతో బలరాంపేట వెళ్లి తల్లిదండ్రులకు జరిగిన విషయం చెప్పింది. తల్లిదండ్రులతో కలిసి ఆదివారం సాయంత్రం పొందూరు పోలీసు స్టేషన్‌కు వచ్చి ఆమె ఫిర్యాదు చేసింది. ఎస్ఐ సత్యనారాయణ కేసు చేసి ఆమెను పొందూరు సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. అనంతరం ఆదివారం బాధితురాలితో వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా సాయిప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యవలస జంక్షన్ జాతీయ రహదారిపై ఆది వారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుణుపూర్‌కు చెందిన జామి రాజేష్, అఖిలకు తీవ్ర గాయాలయ్యాయ. వీరిద్దరు ద్విచక్ర వాహనంపై నరసన్నపేట నుంచి టెక్కలి వైపు వెళ తుండగా కొత్తపేట ఫ్లైఓవర్ బ్రిడ్జి దాటిన తరువాత వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సవరవల్లి సమీపంలో ఇద్దరికి..

భోగాపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సవరవల్లి సమీప జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారని ఏఎస్ఐ తవుడు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కుశాలపురానికి చెందిన యాగంటి కృష్ణారావు ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. తన యజమానిని తీసుకువచ్చేందుకు వాహనంపై డ్రైవర్ రమేశ్‌తో కలిసి శనివారం రాత్రి విశాఖ రైల్వేస్టేషన్‌కు వెళ్లారు. యజమానిని వాహనం ఎక్కించుకుని తిరిగి విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న సమయంలో సవరవల్లి సమీపంలో ముందు వెళ్తున్న లారీని తప్పించబోయి వాహనం డివైడర్‌ను ఢీకొంది. దాంతో కృష్ణారావుకు తీవ్రగాయాలయ్యాయి. డ్రైవర్ రమేశ్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఇద్దరు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తవుడు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పొడుగుపాడు గ్రామానికి చెందిన కోట అప్పన్న (67) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ సత్యనారా యణ తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. అప్పన్న కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడని, పలు ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స అందించిన తగ్గకపోవడంతో శుక్రవారం రాత్రి ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. దీనిని గమనించిన భార్య కనకమ్మ చుట్టుపక్కల వారిని పిలిచి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు ధనుంజయరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గణితంపై ఆసక్తి పెంచుకోవాలి



మండలస్థాయి గణిత క్విజ్ పోటీ విజేతలతో ఉపాధ్యాయులు

నరసన్నపేట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గణితంపై ప్రతి విద్యార్థి ఆసక్తి పెంచుకోవాలని సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘం కోఆర్డినేటర్ అశోక్ అన్నారు. స్థానిక బోర్డు ఉన్నత పాఠశాలలో ఆదివారం మండలస్థాయి గణిత క్విజ్ పోటీ నిర్వహించారు. మడపాం, ఉర్లాం పాఠశాలల విద్యార్థులు మొదటి, రెండో స్థానాలు పొందారు. కార్యక్రమంలో మండల గణిత ఉపాధ్యాయ సంఘ నాయకులు కేశవరావు, గురునాథం, నాగేశ్వరరావు జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన క్విజ్ పోటీల్లో బోరుభద్ర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతగా నిలిచారని హెచ్ఎం పి.రామకృష్ణ తెలిపారు. సంతబొమ్మాళి మండల పరిషత్ పాఠశాలలో జరిగిన గణిత పోటీలో ఎన్. సాయితేజ, డి.పావని, బాడాన తుహినా, బుసకల చాందిని ప్రథమస్థానంలో నిలిచారన్నారు. విజేతలకు హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు బాడాన రాజు, త్రినాథరావు అభినందించారు.

ఈ నీటినే తాగమంటారా?

● కొళాయిల నుంచి బురదనీరు

● ఆందోళన వ్యక్తంచేస్తున్న ప్రజలు

హిరమండలం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ హిరమండలంలో తాగునీటి కష్టాలు తప్పడం లేదు. గత నాలుగు రోజులుగా రక్షిత నీటి పథకం కొళాయిల నుంచి బురద నీరు వస్తుండడంతో స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆదివారం పలు వీధుల్లోని కొళాయి లనుంచి ఎరుపురంగు నీరు రావ డంతో.. ఈ నీటిని ఎలా తాగేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో నీటి సమస్య చాలా కాలంగా ఉన్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేద ని స్థానికులు వాపోతున్నారు. కొళాయిల ద్వారా వచ్చిన బురదనీటి వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై ఈవో హరికృష్ణను వివరణ కోరగా పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న నీళ్ల ట్యాంకు నుంచి సరఫరా అవుతున్న నీరు ఎరుపు రంగులో వస్తోందని, ఈ ట్యాంకు ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో ఉందన్నారు. సంబం ధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లామని, రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

రంగుమారిన నీటిని చూపిస్తున్న స్థానికులు →



అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సురేంద్రబాబు

పాతపట్నం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కొయ్యకొండ గ్రామంలో డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రబాబు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అత్యంత పెద్ద లిఖిత రాజ్యాంగ రూపకర్త డా.బీఆర్ అంబేడ్కర్ అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి యర్రం సుధీర్, జిల్లా అధ్య క్షుడు చల్లా రామారావు, కొప్పల రామచం ద్రుడు, సర్పంచ్ చిగుళ్ల తిరుపతిరావు, యజ్జల భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రేయమిశ్రాకు జాతీయస్థాయి స్వర్ణ నంది అవార్డు

పాతపట్నం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక జర్నలిస్టు కాలనీకి చెందిన శ్రేయ మిశ్రా జాతీయస్థాయి స్వర్ణ నంది అవార్డు సాధిం చింది. విశాఖపట్నం ఆంధ్రా విశ్వవిద్యాలయం నార్త్ క్యాంపస్ గౌతమబుద్ధ అంబేడ్కర్ ఆడిటోరియంలో ఆదివారం శ్రీలంబోదర కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన జాతీయస్థాయి సంగీత నృత్యోత్సవాల్లో శ్రేయమిశ్రా చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శనకు ఈ అవార్డును దక్కించుకోగా సినీ నటుడు సుమన్ బంగారు నందిని అందించి అభినందించారు. కార్యక్రమంలో అకాడమీ వ్యవస్థాపకుడు డా. నక్క అశోక్, జీవీ ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీధర్, సినీనటుడు ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రేయామిశ్రాకు నంది అవార్డును అందిస్తున్న సినీనటుడు సుమన్ →



ఘనంగా లక్ష్మీనరసింహస్వామి చక్రతీర్థ స్నానం

నందిగాం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): సుబ్బమ్మపేటలో లక్ష్మీనరసింహ స్వామి వారి చక్రతీర్థ స్నానం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎ.రంగనాథన్ ఆధ్వ ర్యంలో వేద పండితుడు చామర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకుడు కె.రామానుజాచార్యులు పర్యవేక్షణలో విశేష పూజలు చేసి ఆలయ సమీపంలోని కొలనులలో స్వామివారి ఉత్సవ మూర్తులకు చక్రతీర్థ స్నానాలు చేయించారు. అనంతరం పూర్ణాహుతి చేపట్టారు. దీంతో మూడు రోజుల కల్యాణోత్సవాలు ముగిశాయి.

స్వామికి ప్రత్యేక పూజలు

జలుమూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): చిన్నదూగాం కూడలిలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. కల్యాణోత్సవాల్లో 2వ రోజు ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం జరిగిన జాతరకు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పోటెత్తారు. ఈ ఉత్సవాలు ఆలయ ఈవో రాధాకృష్ణ నేతృత్వంలో జరుగుతున్నాయి. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుదీపాలతో సుందరంగా అలంకరించారు.

భవానీ ఆలయంలో హోమాలు..

పోలాకి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పోలాకి భవానీ దుర్గా జాతరకు ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. ఐదురోజుల పాటు నిర్వహించనున్న ఈ జాతరలో బాగంగా ఆదివారం ఆలయ ధర్మకర్తల దంపతులు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ప్రతీరోజు నిర్వహించే అభిషేకాలు, హోమాలకు దంపతులు హాజరుకావాలని ధర్మకర్తలు టంకాల శ్రీరాములు, పల్లిరాజు భవానీ కోరారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు ఏర్పాట్లు చేశామన్నారు. పలువురు భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఇదిలా ఉండగా జూదం, లాటరీలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ రంజిత్ జాతర నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేశారు.

నరసన్న చెరువుపై అక్రమార్కుల కన్ను

● వేస్ట్ మెటీరియల్ వేసి.. ఆపై ఆక్రమణ

● ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

నరసన్నపేట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న నరసన్న చెరువు కబ్జాకు గురౌతోంది. గొట్టిపల్లి సర్వే నెంబర్ 94 (3)ని 8.16 విస్తీర్ణం కలిగి ఉండే చెరువు ముందుభాగాన్ని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టగా కొంతభాగంలో ఇతర ప్రజా ప్రయోజనాలకు వినియోగించారు. మిగిలిన భాగంలో కొంతమేర ప్రస్తుతం ఆక్రమించి విక్రయించేందుకు పలువురి కన్ను పడింది. రోడ్డును ఆనుకుని ఉన్న స్థలంలో వేస్ట్ మెటీరియల్ వేసి ఆపై ఆ భూమిని ఆక్రమించేందుకు కొందరు అక్రమార్కులు ప్రయత్నిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ స్థలాన్ని ఆక్రమించి మట్టివేయగా అప్పట్లో పత్రికల్లో కథనాలు రావడంతో ఆక్రమణలకు తెరపడింది. అయితే ఆ స్థలాన్ని కవర్ చేస్తూ శ్రీరామనగర్ 5వ లైన్‌కు పంచాయతీ నిధులతో ఈ స్థలం పక్కనే సీసీ రోడ్డు వేశారు. ఈ రోడ్డుకు కుడివైపు దాదాపు 70 శాతం నరసన్న చెరువు ఉంది. అయితే ఈ స్థలం శ్రీరామనగర్ లేఅవుట్ మ్యాప్‌లో ఉన్నట్లు చూపిస్తూ తప్పుడు ధ్రువీకరణ పత్రాలు విక్రయించేందుకు రంగం సిద్ధం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నలుగురు ఈ స్థలాన్ని ఆక్రమించి పంచుకోగా తాజాగా మరో ఇద్దరు వారితో కలిసి తాజాగా విక్రయించేందుకు పన్నాగం పన్నినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో మేజర్ పంచాయతీకి చెందిన ప్రజాప్రతినిధుల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఈవో ద్రాక్షాయిణి వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా గతంలో ఆక్రమించినట్లు తనకు తెలియదని, ప్రస్తుతం వేస్ట్ మెటీరియల్ వేసే ప్రక్రియను అడ్డు కున్నామన్నారు.



నరసన్న చెరువులో ఆక్రమిత స్థలం పక్కనే వెస్ట్ మెటీరియల్ వేసిన దృశ్యం

శివరాంపురం రోడ్డుకు మోక్షమెప్పుడు?

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నగరంపల్లి పంచాయతీ పరిధి శివరాంపురం రోడ్డుకు మోక్షమెప్పుడో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డును బీటీగా మార్చేందుకు వైసీపీ ప్రభుత్వంలో కొంతమేర పనులకు శ్రీకారం చుట్టినా నేటికీ ఆ పనులు పూర్తి కాలేదు. నిధులు విడుదల కాకపోవడం వల్లే పనులు జరగలేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఐదేళ్లు గడిచినా రోడ్డు పనులు ప్రారంభం కాకపోవడంతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రోడ్డంతా రాళ్లు తేలడడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయా లని గ్రామస్థులు కోరుతున్నారు.



రాళ్లు తేలిన శివరాంపురం రోడ్డు

'మెండు'గా.. పర్యాటకం

(ఐదో పేజీ తరువాయి)

వీలుగా చిల్డ్రన్స్ పార్కు, అడ్వంచర్ పార్కులు అందుబాటులోకి రానున్నాయి. ట్రెకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు. చెరువులు, స్విమ్మింగ్ పూల్స్ ట్యాంకులు సైతం నిర్మిస్తున్నారు. అన్ని వంటకాలను అందించే రెస్టారెంట్, యోగా సెంటర్, పర్ణశాల ఏర్పాటు చేస్తున్నారు. పర్యాటకులను ఆకట్టుకునేందుకు వీలుగా భారీ జంతువుల బొమ్మలు సిద్ధం చేస్తున్నారు. అటవీశాఖ పర్యవేక్షణ ఉండేలా అడ్మిన్ స్టేషన్ కార్యాలయాన్ని సైతం అందుబాటులోకి తెస్తున్నారు.

● ఆహ్లాదం పంచే ప్రాంతం..

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు 5 కిలోమీటర్ల దూరంలో.. జాతీయ రహదారి పక్కనే కాశీబుగ్గ మెండు నగర వనం ఉంది. చుట్టూ పచ్చని చెట్లు, మధ్యలో రైల్వేట్రాక్, పక్కనే పచ్చిక బయళ్లతో పొలాలు ఉంటాయి. మనసుకు ఆహ్లాదనిచ్చే వాతావరణం ఉన్నచోట.. అత్యాధునిక వసతులతో నగరవనం నిర్మిస్తుండడం శుభ పరిణామం. ఈ నగర వనం జిల్లాలోనే పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. పలాసతోపాటు ఇచ్ఛాపురం, పాతపట్నం, టెక్కలి నియోజకవర్గాల ప్రజలకు సైతం ఈ పర్యాటక ప్రాంతం అందుబాటులో ఉంటుందని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు.

అ'పూర్వ' కలయిక

నందిగాం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నందిగాం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1987-92 మధ్య ఆరు నుంచి పదో తరగతి నుంచి వరకు చదువుకున్న విద్యార్థులు 32 ఏళ్ల తరువాత ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో ఉన్న వారంతా ఒకచోట కలిసి నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందం పొందారు. ఒకరికొకరు పరిచయం చేసుకుని ఆట పాటలతో సందడి చేశారు. నాటి ఉపాధ్యాయులు జె.ఆదినారాయణ, ఈశ్వరరావు, ఎస్.వెంక టేశం, పి.రామకృష్ణ, బి.తాతయ్య, సీహెచ్ సద్గుణమూర్తి, టి.లక్ష్మీనారాయణ, ప్రస్తుత హెచ్ఎం వై.హరిబాబును సత్కరించి వారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో నాటి విద్యార్థులు జె.జయరాం, ఆర్.శాంతికుమార్, ఎ.వెంకటరమణ, జి.రవిబాబు, డి.లక్ష్మీనారాయణ, ఎ.దేవరాజు, కె.నీరజ, పి.ఉషారాణి, వనజాక్షి, గణపతి, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

టెక్కలి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2015లో ఇంటర్ చదువుకున్న విద్యర్థులు సహచర మిత్రుడు బన్నువాడ గ్రామానికి చెందిన కొత్తపల్లి కృష్ణారావు గత ఏడాది నవంబరులో రైలు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబానికి బాసటగా నిలిచారు. ఈ మేరకు ఆదివారం వీరంతా సమావేశమై మిత్రుని ఇద్దరు పిల్లల పేరున రూ.40 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్, నిత్యావసర సరుకులు ఆ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారికి కృష్ణారావు భార్య కృతజ్ఞతలు తెలిపారు.



నందిగాం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1987-92 మధ్య చదివిన విద్యార్థుల సమ్మేళనం

'నారాయణా'.. నీటి కష్టాలు తీరేనా?

(ఐదో పేజీ తరువాయి)

ఉండడంతో దీనిపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు హడలి పోతున్నారు. ఆధునికీకరణ పనుల్లో భాగంగా బ్రిడ్జిలను నిర్మించాల్సి ఉంది. అలాగే మాల కుశాలపురం, పెయ్యలవానిపేట, పొందూరు మండలం కింతలి పరిధిలోని దోమగుండం చెరువు వద్ద పూర్తిగా పాడైన రెగ్యులే టర్స్‌ను మార్చాలి. దోమగుండం చెరువు వద్ద పాడైన మదుమును పునర్నిర్మించకపోతే నీరు వృథా అయ్యే అవకాశం ఉంది.

తప్పని కష్టాలు..

నారాయణపురం కుడి కాలువ కింద శివారున ఎచ్చెర్ల మండలంలోని తోటపాలెం, కొత్తపేట, ముద్దాడ, ధర్మవరం, పొన్నాడ, బొంతలకోడూరు, భగీరథపురం తదితర గ్రామాల పరిధిలోని ఆయకట్టుకు ఏటా అతికష్టమ్మీద సాగునీరు సరఫరా చేస్తున్నారు. మొక్కుబడిగానే పనులు చేస్తుండడంతో ఏటా అన్నదాతలు సాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ప్రత్యేక చొరవతో నవభారత్ జంక్షన్ నుంచి దుప్పలవలస వరకు కాలువలో పూడికలు, జంగిల్ క్లియరెన్స్ చేయించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్పందించి ఆధునికీకరణ పనులు పూర్తిచేయాలని, సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఆధునికీకరణ పూర్తయితేనే..



ఏటా శివారు గ్రామాల రైతులకు సాగునీటికి ఇబ్బంది తప్పడంలేదు. ఆధునికీకరణ పనులు పూర్తయితే తప్ప శివారు గ్రామాలకు పూర్తిస్థాయిలో సాగునీరందే పరిస్థితి లేదు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఆధునికీకరణ పనులకు నిధులు మంజూర య్యాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఈ పనులు పూర్తవుతాయనే నమ్మకం ఉంది.

-పంచిరెడ్డి కృష్ణారావు,
నారాయణపురం ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు

పనుల ప్రారంభానికి చర్యలు..

నారాయణపురం ఆధునికీకరణ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారులు కూడా ఈ అంశంపై చర్చిస్తున్నారు. నిర్దేశించిన గడువులోగా పనుల పూర్తికి ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తాం.

-కె.రాంబాబు, ఏఈఈ, జలవనరుల శాఖ

న్యూస్ బాక్స్

సిగ్నల్ సమస్యతో ఇక్కట్లు

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): బైపల్లి వద్ద ఉన్న బీఎస్ఎన్ఎల్ టవర్ సక్రమంగా పనిచేయకపోవడం సిగ్నల్ సమస్యతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని బైపల్లి, అక్కుపల్లి గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో ఒకే ఒక్క టవర్ ఉండడం, వినియోగదారులు అధిక సంఖ్యలో ఉన్నారు. సిగ్నల్ సరిగా లేక సమాచారం తెలిపేందుకు అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటి కైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

భీష్ముని సత్యనిరతి భావితరాలకు ఆదర్శం

పోలాకి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): భీష్ముని సత్యనిరతి భావితరాలకు ఆదర్శం కావాలని ఒడిశా రాష్ట్రం అడప దేవానందాశ్రమ అధ్యక్షుడు అలియాన వినయ్‌కుమార్ అన్నారు. దండులక్ష్మీపురం చింతాడపేట స్వామి రామయోగిసేవాశ్రమంలో ఆది వారం సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. శ్రీకృష్ణుడు ధర్మాన్ని గెలిపించేందుకు అహర్నిశలు కృషిచేశాడన్నారు. భక్తుడికి సారధిగా ఓ మహిళ భారత యుద్ధానికి ముగింపు పలికారన్నారు. భీష్ముని చరిత్ర ఆయన త్యాగభావాన్ని వివరించారు. సేవానందాశ్రమ అధ్యక్షుడు బమ్మిడి విశ్వనాథం, లక్ష్మణరావు, గోపాలస్వామి, గోవిందరావు, అనంతరావు, బి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

మట్టికోసం చెరువు గట్లను తవ్వేస్తున్నారు..



సీతాపురం చెరువు గట్టు మట్టిని తవ్వుతున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): సీతాపురం, పెద్దబొడ్డపాడు గ్రామాల్లోని చెరువు గట్లను తవ్వి మట్టిని అక్రమంగా తరలిస్తుండడంతో స్థానిక రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇటుకల ఫ్యాక్టరీ యజమానులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు వారికి కావాల్సిన మట్టిని తీసుకువెళ్లేందుకు చెరువు గట్లును తవ్వుతుండడంతో వర్షాకాలంలో ఇబ్బందులు పడే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. చెరువుల్లో నీటిని నిలువ ఉంచేందుకు ఉపాధి పనుల్లో చెరువులోని మట్టిని గట్లపై వేయగా దానికి ఇలా అక్రమంగా తరలిస్తుండడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి మట్టి తవ్వకాలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై డీటీ మురళీ కృష్ణ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా మట్టి తవ్వ కాలు చేపట్టే వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.